సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 26 । డిసెంబర్ । 2023


సిద్దిపేట సీఎస్ఐ చర్చిలో చిన్నారులకు కేక్ తినిపిస్తున్న హరీశ్‌రావు


మెదక్ సీఎస్ఐ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

కరుణామయ.. కరుణించవయ్యా..

- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు
- మారుమోగిన ఏసు నామం
- సీఎస్ఐ చర్చిలో కేక్ కట్ చేసిన హరీశ్‌రావు


సిద్దిపేట సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు
ప్రార్థన చేస్తున్న యువతి

కరుణామయుడైన ఏసుక్రీస్తు బాలఏసుగా భూమిపై అవతరించిన వేళ.. భక్తుల హృదయాలు భక్తిభావంతో నిండిపోయాయి. సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా అంతటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిలలో ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పాస్టర్ ఏసు ప్రభు సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం ప్రత్యేక గీతాలు, చిన్నారుల నృత్యాలు, నాటకాలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సీఎస్ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ 23 ఏళ్లుగా క్రమం తప్పకుండా సిద్దిపేట చర్చిలో మీ మధ్యలోనే క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

భక్తజన సంద్రంగా మెదక్ సీఎస్ఐ చర్చి

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చి సోమవారం జనసంద్రమైంది. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. ఉదయం 4 గంటల నుంచే చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. చలి తీవ్రతను లెక్క చేయక భక్తులు ఏసయ్య దీవెనల కోసం చర్చి ప్రాంగణంలో బారులు తీరారు. అనంతరం మొదలైన తొలి ఆరాధనలో ఈ లోకంలో సర్వం నిండి ఉన్న కరుణా మయుడు ఏసుప్రభువే మనకు అండ అంటూ దయాసిస్ చైర్మన్ ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ కె. పద్మారావు ప్రసంగించారు.


మెదక్ సీఎస్ఐ చర్చి ఎదుట చిన్నారితో తల్లి

న్యూస్‌రీల్

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


మంత్రి కొండా సురేఖను కలిసిన కలీమొద్దీన్, నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను నగరంలోని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకుంటున్న మంత్రి సురేఖకు శుభాకాంక్షలు తెలిపినట్లు టీపీసీసీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు కలీమొద్దీన్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు వహాబ్, అజ్మత్, అర్షద్, ఇమ్రాన్ అలీ, ముస్తక్ మున్నా తదితరులు ఉన్నట్లు తెలిపారు.

11 నుంచి రాష్ట్రస్థాయి మెగా కబడ్డీ పోటీలు

గజ్వేల్: పట్టణంలో రాష్ట్రస్థాయి మెగా కబడ్డీ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పట్టణంలోని ఐఓసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) వెనుక భాగంలోని మైదానం వేదికగా వచ్చే నెల 11నుంచి 14వరకు ఈ పోటీలు జరుగనున్నాయి. 33జిల్లాల నుంచి బాలికలు, బాలుర జట్లు, వెయ్యిమంది జాతీయ స్థాయి క్రీడాకారులు, మరో వంద మందికిపైగా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పాల్గొనున్నారు. ఈ విషయాన్ని సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి శివకుమార్‌లు తెలిపారు. రాష్ట్రస్థాయి టోర్నీ నేపథ్యంలో సిద్దిపేట జిల్లాకు సంబంధించిన ఎంపికలను సైతం ఈనెల 28న గజ్వేల్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇరవై ఏళ్లలోపు వయసున్న యువతీ, యువకులు ఇందులో పాల్గొనడానికి అర్హులన్నారు. పూర్తి వివరాలకు 8885728286, 8919679704 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మనుస్మృతి ప్రతుల దహనం


మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న డీబీఎఫ్ నాయకులు

గజ్వేల్‌రూరల్: మండల పరిధి అనంతరావుపల్లిలో సోమవారం మనుస్మృతి ప్రతులను డీబీఎఫ్ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి మాట్లాడుతూ ఆచారాలు, కట్టుబాట్లు పేరిట, వ్యవసాయకూలీలుగా, బానిసలుగా చేసి విద్యకు, సాంఘీకంగా, ఆర్థికంగా, రాజకీయంగా దూరం చేసే విధంగా మనుస్మృతి ఉందన్నారు. భారత పౌరులందరికీ సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికంగా, విద్యావిధానంలో, ఆర్థిక అసమానతలను రూపుమాపడానికి, రాజ్యాంగానికి విఘాతం కలిగించేలా ఉన్న మనుస్మృతి ప్రతులను దహనం చేశామన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు శ్రీకాంత్, స్వామి, కిష్టయ్య, రాజు, భాను, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

భారతీయ కిసాన్ సంఘ్ అఖిల భారత కార్యదర్శి సాయిరెడ్డి


మాట్లాడుతున్న సాయిరెడ్డి

రామాయంపేట(మెదక్): భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని భారతీయ కిసాన్ సంఘ్ అఖిల భారత కార్యదర్శి సాయిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వివేకానంద ఆవాస విద్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. కిసాన్ సంఘ్ రైతుల శ్రేయస్సు కోసం అహర్నిశలూ కృషి చేస్తోందన్నారు. సంఘంలో రైతులంతా సభ్యులుగా చేరాలని సూచించారు. సంఘ్ తెలంగాణ ఇన్‌చార్జి ఆక్రే మాట్లాడుతూ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పది కిలోల తరుగు తీసి రైతులను తీవ్రంగా నష్టాలపాలు చేశారని ఆరోపించారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలను పూర్తి స్థాయిలో అరికట్టాలని, వాటి తయారీ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి, జిల్లా కిసాన్ సంఘ్ ప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, అనిల్ కుమార్, రైతులు హాజరయ్యారు.

ప్రజాపాలనపై కసరత్తు

- ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- నేడు జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం
- రేపు ఇన్‌చార్జ్ మంత్రి కొండా సురేఖ సమీక్ష


సిద్దిపేట కలెక్టరేట్

సాక్షి, సిద్దిపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. అందులో భాగంగా ప్రజలకు పాలన చేరువ అయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం చేపడుతోంది. కార్యక్రమం అమలు గురించి జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించి దిశ నిర్దేశం చేసిన విషయం విదితమే. సీఎం చేసిన సూచనలను క్షేత్ర స్థాయిలో అధికారులకు వివరించేందుకు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సమావేశం నిర్వహించనున్నారు.

జిల్లా యంత్రాంగం ప్రణాళికలు


కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించే తొలి కార్యక్రమం ప్రజాపాలన.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోంది. కలెక్టర్ నేతృత్వంలో అధికారులు చర్యలు ప్రారంభించారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించనున్నారు. బుధవారం రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ ఇన్‌చార్జి కొండా సురేఖమురళీధర్ రావు నేతృత్వంలో సమీక్ష చేయనున్నారు.

అన్నింటికీ ఒకే దరఖాస్తు..

హామీల అమలుకు ప్రజాపాలన కార్యక్రమం ద్వారా పల్లె, పట్టణాలలో దరఖాస్తులను స్వీకరించనున్నారు. మహాలక్ష్మి (మహిళలకు నెలకు రూ. 2,500 నగదు బదిలీ), రైతు భరోసా (ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు), గృహజ్యోతి పథకం(రూ.500కే గ్యాస్ సిలిండర్), ఇందిరమ్మ ఇళ్లు (ప్రతి లబ్ధిదారునికి ఇల్లు నిర్మించుకునేందుకు రూ. 5 లక్షలు), చేయూత పథకం(నెలకు రూ.4వేలు పింఛన్) అమలు కోసం కసరత్తు ప్రారంభించారు. అందులో భాగంగా అమలు కోసం క్షేత్రస్థాయిలో అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. అన్నింటికీ కలిపి ఒకే దరఖాస్తు ఇస్తే సరిపోతుంది. ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తులను నేరుగా అధికారులు స్వీకరించి కంప్యూటరీకరించి రశీదును ఇవ్వనున్నారు. 499 గ్రామ పంచాయతీలలో, ఐదు మున్సిపాలిటీలలో వార్డులలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం అర్హులను ఎంపిక చేసి ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఐదు పథకాలను అమలు చేయనున్నారు.

అండగా నిలిచింది కేసీఆరే

- వికలాంగుల సంక్షేమానికి కృషి
- లయన్స్‌క్లబ్, అభయజ్యోతి సేవా కార్యక్రమాలు భేష్
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు


అభయజ్యోతి సంస్థకు చెక్‌ను అందిస్తున్న హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో వికలాంగులకు రూ.4వేల పింఛన్ అందించిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని లయన్స్‌క్లబ్, అలయన్స్‌క్లబ్, వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో మానసిక వికలాంగులకు అభయ జ్యోతి స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని, సోలార్ సిస్టం ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ మానసిక వికలాంగుల పట్ల మానవత హృదయాన్ని కేసీఆర్ చాటుకున్నారన్నారు. అందువల్లే దేశంలోనే ఎక్కడా లేని విధంగా రూ.4 వేల పింఛన్ అందించారన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఎన్నికల ప్రచారంలో భాగంగా వికలాంగులకు రూ.6 వేల ఫించన్ అందిస్తామని హామీ ఇచ్చారని, వెంటనే అమలు చేయాలన్నారు. మానసిక వికలాంగులకు అభయజ్యోతి సంస్థ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. మానసిక వికలాంగులకు అవసరాల కోసం నాజీతం నుంచి కొంత డబ్బు ఇస్తానని హామీ ఇచ్చారు. సిద్దిపేటలో అన్ని రకాల ఆరోగ్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. కంటి సమస్యలకు పరిష్కారం అయ్యేలా సిద్దిపేటలోనే ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిని రూ.6కోట్లతో ఏర్పాటు చేశామన్నారు. కరోనా సమయంలో ప్రజలకు ఎంతో సేవ చేశారన్నారు. అభయజ్యోతి సంస్థ సొంత భవనం కోసం స్థలం కేటాయించి, నిర్మాణానికి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో అభయజ్యోతి, లయన్స్‌క్లబ్, అలయన్స్‌క్లబ్, వాసవీక్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ స్కాన్‌తో డబ్బులు విత్‌డ్రా చేసుకోవచ్చు

సిద్దిపేటకమాన్: క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే క్షణాల్లో డబ్బులు విత్‌డ్రా చేసుకోవచ్చని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌తో డబ్బులు విత్‌డ్రా చేసుకునే మిషన్‌ను హరీశ్‌రావు సోమవారం ప్రారంభించారు. డిజిటల్ మనీ ట్రాన్సాక్షన్‌లో భాగంగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే నగదు విత్‌డ్రా చేసుకునే సౌకర్యం ఉంటుంది. మినీ ఏటీఎం మాదిరిగానే క్యూఆర్ మినీ ఏటీఎం పనిచేస్తుంది. ఆధార్ కార్డు వేలిముద్ర, డెబిట్, క్రెడిట్ కార్డు, క్యూఆర్ స్కానింగ్, యుపిఐ సర్వీసెస్ ద్వారా నగదు విత్‌డ్రా చేసుకునే సౌకర్యం కలదు. స్కానింగ్ ద్వారా నగదు విత్‌డ్రా చేసే విధానం దేశంలోనే మొదటిసారిగా సిద్దిపేటలో లాంచింగ్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ నరేష్‌గుప్తా, కోచైర్మన్ షేక్ షమీం తదితరులు పాల్గొన్నారు.

మాడ వీధుల్లో ఊరేగిన నృసింహుడు

నాచగిరి క్షేత్రం.. అధ్యయనోత్సవ శోభితం


నాచగిరిలో దర్శనం కోసం బారులుతీరిన భక్తులు, (ఇన్‌సెట్‌లో) ఊరేగుతున్న స్వామివారు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ నాచగిరి పుణ్యక్షేత్రం అధ్యయనోత్సవ విశేష కార్యక్రమాలతో అలరారుతోంది. అధ్యయనోత్సవాల మూడో రోజు సోమవారం తెల్లవారుజామున గర్భగుడిలో కొలువైన లక్ష్మీనృసింహస్వామివార్లకు అర్చకులు విశేష అభిషేకం నిర్వహించారు. పట్టువస్త్రాలు, సర్వాభరణాలు, పూలమాలలతో కమనీయంగా అలంకరించారు. ప్రబంధ పారాయణం చేశారు. అర్చన జరిపారు. స్వామివారి సేవ నిర్వహించారు. ఆలయ మాడ వీధుల్లో స్వామివారు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. సెలవు రోజు కలిసిరావడంతో వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. దీంతో క్యూలైన్లు రద్దీగా మారాయి. స్వామివారిని దర్శించుకుని తరించారు.

నేడు దత్త జయంతి మహోత్సవం

నాచగిరి శ్రీదత్తసాయి మందిరంలో మంగళవారం దత్తజయంతి మహోత్సవం ఘనంగా జరుగుతుందని ఈఓ అన్నపూర్ణ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దత్తాత్రేయస్వామికి విశేష పంచామృతాభిషేకం, అగ్నిప్రతిష్ఠ, గణపతి, రుద్ర, దత్తాత్రేయ మూలమంత్ర హవనాదికార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఫలితాలే లక్ష్యంగా..

- అధికారులు పనిచేయాలి
- ప్రజాపాలనపై మంత్రి దామోదర దిశానిర్దేశం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ''తెలంగాణ రాష్ట్రంలో మార్పు జరిగింది.. ప్రజల ఆశయాలు, ఆశలు.. ప్రభుత్వం ఏం వాగ్దానాలు చేసింది.. వాటి ఆచరణ.. హామీల అమలు ఎలా చేయాలి.. ప్రభుత్వం ఏది ఆదేశించినా క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందేలా అమలు చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిదే. ప్రభుత్వం నిర్మాణాత్మక సూచనలు స్వీకరిస్తుంది. ప్రభుత్వ యంత్రాంగాన్ని గౌరవిస్తాం..'' అని రాష్ట్ర వైద్యారోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి సిలారపు దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. మంత్రి బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చారు. ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం జిల్లాస్థాయి సమన్వయ సమావేశంలో పాల్గొన్న రాజనర్సింహ జిల్లా అధికార యంత్రాగానికి దిశానిర్దేశం చేశారు. ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు జరుగనున్న ఈ ప్రజాపాలన కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఆదేశించారు. ఆయా పథకాలకు సంబంధించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ, వాటి పరిశీలన పకడ్బందీగా జరగాలన్నారు. ఈ క్రమంలో అధికార యంత్రాంగం సహనం, ఓపికతో పనిచేయాలని సూచించారు.

రోడ్డు విస్తరణలో అన్యాయం సహించం


రాస్తారోకో చేస్తున్న అఖిలపక్షం నాయకులు

- ఇరువైపులా సమానంగా చేపట్టాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి
- చేర్యాలలో అఖిలపక్షం రాస్తారోకో

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల పట్టణంలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులు సక్రమంగా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం పాత బస్టాండ్ వద్ద అఖిల పక్షం నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ చేర్యాల పట్టణంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో కొంత మందికి తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. రోడ్డుకు ఇరువైపులా సమానంగా రోడ్డు విస్తరించాలని అన్నారు. ఒక పక్క 38 ఫీట్లు, మరో పక్క 46 ఫీట్లు మార్కింగ్ చేస్తూ రోడ్డు విస్తరణ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూన్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి సమానంగా విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, బూర్గు సురేష్, అందె బీరయ్య, మల్లిగారి యాదగిరి, బుట్టి భిక్షపతి, బుట్టి సత్యనారాయణ ,పోతుగంటి రాందాస్, ముస్త్యాల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్త చండీ హోమం

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రంగా బాసిల్లుతున్న బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో దత్తాత్రేయ జయంతి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం ఆశ్రమ ఆవరణలో 21 యజ్ఞ గుండాలతో దత్త-చండీ హోమంను ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, డా.సిద్దేశ్వర స్వామి నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి హోమం, పుణ్యాఃవాచనం, ఆవాహిత దేవతారాధన, యంత్రపూజ, చండీ పారాయణం, పూర్ణా హుతి, మహా మంగళ హారతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సునీతాపాటిల్, న్యాల్‌కల్ మాజీ జెడ్పీటీసీ శారద, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, కాంగ్రెస్ నాయకుడు భాస్కర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్, అనసూయమాత, అర్చకులు శివశంకర్ స్వామి పాల్గొన్నారు.

మల్లకంబ పోటీలు


మల్లకంబ విన్యాసం చేస్తున్న విద్యార్థులు

సిద్దిపేటరూరల్: మల్లకంబ విన్యాసాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేందుకు కృషి చేయాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పన్యాల రామేశ్వర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామంలో మొదటి సారిగా ఉమ్మడి జిల్లా స్థాయిలో అండర్ 14,- 17 క్రీడాకారులకు మల్లకంబ క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు నాగర్‌కర్నూలులో నిర్వహించే రాష్ట్ర స్థాయి మల్లకంబ పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలన్నారు. ఈ పోటీల్లో రాఘవాపూర్ జెడ్పీహెచ్ఎస్, విద్యారణ్య ఆవాస విద్యాలయం తడ్కపల్లి విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మల్లన్నకు ఆభరణాల అందజేత



ఆభరణాలు అందజేస్తున్న నగేశ్ నీలిమ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామికి కొమురవెల్లి గ్రామానికి చెందిన భక్తులు మంకాల నగేశ్ నీలిమ దంపతులు సోమవారం సుమారు రూ.45 వేల విలువగల వెండి శఠగోపం, బంగారు కోరమీసాలను ఆలయ ఈవో బాలాజీ సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో అంజయ్య, ఉపసర్పంచ్ కొండా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి..



కిష్టవ్వ (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్ల కుమ్మరి కుంటలో సోమవారం ప్రమాదవశాత్తు పడి వృద్ధురాలు పూదరి కిష్టవ్వ (72) మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం కిష్టవ్వకు నలుగురు కుమారులు. ఆమె ఒంటరిగా నివసిస్తోంది. సోమవారం బహిర్భూమికని వెళ్లిన కిష్టవ్వ ప్రమాదవశాత్తు కాలు జారిపడి మృతి చెందింది. కొందరు రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన మల్లేశ్

కొల్చారం(నర్సాపూర్): బైకును ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండల కేంద్రం కొల్చారం సమీపంలోని మెదక్ –నర్సాపూర్ జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం .. మెదక్ పట్టణానికి చెందిన మల్లేశ్ తన బైక్‌పై మెదక్ వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశ్ కాలికి బలమైన గాయాలు తగిలాయి. అతడిని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కొల్చారం పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి



రాజు బెనియా మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): ఇటుకబట్టీలో ట్రాక్టర్ నడుపుతున్న సమయంలో అదుపు తప్పి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో సోమవారం జరిగింది. గుమ్మడిదల ఏఎస్‌ఐ పర్వేజ్ అహ్మద్ కథనం ప్రకారం.. అన్నారంలోని ఎస్‌పీఎస్ ఇటుక బట్టీలో ఒడిశా రాష్ట్రం, బలంగిర్ జిల్లా, తిక్కరపాడ్ గ్రామానికి చెందిన రాజుబెనియా(39) రెండేళ్ల నుంచి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటుకల తయారీకి కేజ్ వీల్స్‌తో కూడిన ట్రాక్టర్‌ను మట్టిని తొక్కించేందుకు నడుపుతుండడంతో అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో డ్రైవర్ రాజు బెనియా మట్టిలో కూరుకుపోయి మృతి చెందాడు. అతడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఇటుక బట్టీ ఓనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

క్రిస్మస్..జోష్


ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ వేడుకలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోష్‌తో సాగాయి. సోమవారం క్రైస్తవులంతా అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మెదక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. మండలాలు, గ్రామాలలోని చర్చిలను శోభాయమానంగా అలంకరించారు. ఆయా చర్చిల పాస్టర్లు విశ్వాసకులకు దైవ సందేశాలిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉత్సాహంగా గీతాలు ఆలాపించారు. కేక్‌లు కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.



మెదక్ చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ



మెదక్ చర్చిలో ప్రార్థనలు..



మెదక్ చర్చి ఎదుట జనం సందడి



ప్రార్థన చేస్తున్న చిన్నారి



దుబ్బాక: క్రిస్మస్ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత



గజ్వేల్‌రూరల్: సబ్బుబిళ్లలపై చిత్రీకరించిన ఏసుక్రీస్తు, వాజ్‌పేయ్ రూపాలు



కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు తీసుకుంటున్న జనం



గజ్వేల్‌రూరల్‌లోని అద్భుత బాలయేసు పుణ్యక్షేత్రం



కొడిపల్లి చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ప్రార్థనలు చేస్తున్న భక్తులు



మెదక్ చర్చి వద్దకు గొర్రె పిల్లను తీసుకువస్తూ..



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రార్థనలు చేస్తున్న చిన్నారులు

స్వయం ఉపాధి.. ఆర్థిక వృద్ధి

- రాయితీలపై రుణాలు
- 18,795 మహిళా సంఘాలు
- 695 గ్రామైక్య గ్రూపులు
- వినియోగించుకోవాలి:అధికారులు

పొదుపు సంఘాలలోచేరి మహిళలు పేదరికం నుంచి బయట పడేందుకు ప్రయత్నిస్తున్నారు. స్వయం ఉపాధి దిశగా అడుగులేస్తూ బ్యాంకు నుంచి రుణాలు తీసుకుంటూ చాలా మంది ఉపాధి పొందుతున్నారు. ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కాలన్న లక్ష్యంతో మహిళలు పొదుపు సంఘాల్లో చేరుతున్నారు.

– సంగారెడ్డి టౌన్



కంది మండలంలో మహిళా సంఘం సభ్యురాలికి మంజూరైన పిండిగిర్నీ

మహిళలకు బ్యాంకు రుణాలు అంతంతమాత్రంగా ఉండడంతో స్వయం ఉపాధికి బాటలు వేసుకోలేక పోతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటు దిశగా వారిని అడుగులు వేయించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) నిర్ణయించింది. మహిళలకు కిరాణా దుకాణాలు, మగ్గం వర్క్, బ్యూటీ పార్లర్లు, ఆయిల్ మిల్లులు, విస్తరాకుల మిషన్లు, పౌల్ట్రీఫామ్‌లు, టెంట్ హౌస్ నిర్వహణకు ఆర్థిక సాయం అందజేస్తున్నారు. దానికి శ్రీనిధి పథకం ఉపయోగపడుతుంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 2023 సంవత్సరంగాను రూ.676 కోట్లు మహిళా సంఘాలకు అందించారు. గ్రూపులో ఒక్కొరికి రూ.50 వేల నుంచి మొదలుకొని మూడు లక్షల వరకు అందజేస్తున్నారు. గ్రూపులోని అందరి సభ్యులకు కలిపి 20 లక్షల వరకు అందజేస్తున్నారు.

చిరుధాన్యాల యూనిట్లపై సర్వే

ఆహారశుద్ధి యూనిట్లపై ఇప్పటికే సర్వే నిర్వహించారు. వాటి అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించారు. ప్రస్తుతం కొనసాగుతున్న యూనిట్లపై సెర్ప్ కార్యాలయానికి నివేదిక పంపారు. జిల్లాలో మిరప, పసుపు పప్పు మిల్లులు, పాల పదార్థాల ఉత్పత్తి, చిరుధాన్యాలు, నూనె, చిన్న రైస్ మిల్లులు, పాపడాలు, పచ్చళ్ల తదితర యూనిట్‌లు ఏర్పాటు చేసుకుని మహిళలు ఇప్పటికే ఉపాధి పొందుతున్నారు. పీఎం ఫార్ములేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రెన్యూర్ స్కీమ్(పీఎంఎఫ్ ఎంఈ) పథకంలో భాగంగా రాయితీపై రుణాలు మంజూరు చేస్తున్నారు. దీనివల్ల యూనిట్ల విస్తరణకు జిల్లాలో 695 గ్రామైక్య సంఘాలు, 18,795 మహిళా సంఘాలకు సంబంధించిన 8531 గ్రూపులకు నిధులు మంజూరు చేసినట్లు సంబంధితశాఖ అధికారులు వెల్లడించారు.

యూనిట్ల విస్తరణకు ప్రోత్సాహం

మహిళా సంఘాలకు చెందిన సభ్యుల్లో కొందరు ఇప్పటికే ఆహార సంబంధితరంగంలో ఉపాధి పొందుతుండగా ఆహారశుద్ధి యూనిట్ల విస్తరణకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. తద్వారా మరింత మంది మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించనున్నారు. అందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సాయం అందిస్తారు. శిక్షణలు ఇవ్వడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి. ఆహారం కల్తీ లేకుండా తయారు చేయడానికి వీలు కల్పిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



మహిళలు గ్రామాలలో ఆర్థికంగా స్థిరపడాలని పేదరిక నిర్మూలనకు మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం రుణాలు ఇస్తోంది. ఫలితంగా వివిధ రకాల ఉపాధి పనులు లభిస్తున్నాయి. మహిళా సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎంపిక వేసిన మహిళా సంఘాల సభ్యులకు రాయితీ రుణాల కోసం దరఖాస్తులు చేయించడంతోపాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

– సూర్యారావు, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి

పురుగు మందు తాగి ఆత్మహత్య

మద్దూరు(హుస్నాబాద్): పురుగు మందుతాగి ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దూళ్మిట్ట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. దూళ్మిట్ట గ్రామానికి చెందిన సుందరగిరి రాజు(45) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దానికితోడు చాలా రోజుల క్రితం అతడి భార్య చనిపోవడంతో తీవ్ర మనోవేదనతో ఉన్నాడు. ఈ క్రమంలో తన కుమారుడికి భారం కాకూడదని భావించి ఆదివారం ఉదయం పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజు కుమారుడు సుందగిరి తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ వ్యక్తి ఉరివేసు కుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇంద్రానగర్‌లో సోమ వారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భూపాల్ పల్లి జిల్లా చెందిన మధుసూదన్(36) ఐదేళ్ల క్రితం జీవనోపాధికి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్‌కు వలస వచ్చాడు. తన భార్యతో ఓ ఇంట్లో అద్దెకుంటూ కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం అతడి భార్య బయటికు వెళ్లిన సమయంలో గదిలోని ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మధుసూదన్ తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ సెంటర్‌లో మృత్యువాత



మల్లేశం(ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): చికెన్ సెంటర్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నా ఓ వ్యక్తి ఆ చికెన్ సెంటర్‌లోనే మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన అక్కన్నపేట మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ తాండ్ర వివేక్ కథనం ప్రకారం.. అంతక్కపేట గ్రామానికి చెందిన ఇప్పకాయల మల్లేశం (38) కొన్ని రోజులుగా అక్కన్నపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో అద్దె భవనంలో చికెన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఆదివారం ఉదయం 6 గంటలకు షాప్‌కు వెళ్లాడు. కాని రాత్రి 10 గంటలు దాటినా ఇంటికి తిరిగి రాకపోవడంతో అతడి భార్య స్వాతి తన మరిది గబ్బెట రాజుకు ఫోన్‌లో సమాచారం అందజేసింది. దీంతో రాజు చికెన్ సెంటర్‌కు వెళ్లి చూడగా అక్కడ విగతజీవిగా పడి ఉన్న మల్లేశాన్ని గుర్తించాడు. మల్లేశం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివేక్ తెలిపారు.

అనుమానాస్పదంగా మృతి

పటాన్‌చెరు టౌన్: మూత పడిన ఓ పరిశ్రమలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... పారిశ్రామికవాడలో రిలయబుల్ పేపర్ మిల్ పరిశ్రమ కొంత కాలంగా మూత పడింది. పరిశ్రమలో ఉన్న సంపులో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. అక్కడ విధులు నిర్వహిస్తున్న కాపలాదారుడు 23న మృతదేహాన్ని గుర్తించాడు. సంపులో తలభాగం మాత్రమే మునిగి ఉండడం అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు ఆదివారం కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మంచి పెరగాలి.. చెడు తొలగాలి

- మనసుపై పట్టు ఉండాలి
- గరికపాటి ప్రవచనాల గగనసాటి
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: గరికపాటి ప్రవచనాలు మనసు కుదుట పడేలా చేస్తున్నాయి.. మంచి పెరుగాలి.. చెడు తొలగాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరిశ్‌రావు ఆకాంక్షించారు. సోమవారం రాత్రి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మూడు రోజులుగా కొనసాగుతున్న చాణక్య నీతిశాస్త్రంపై గరికపాటి నర్సింహారావు చేస్తున్న ప్రవచనాల ముగింపు సందర్భంగా ఆయన పాల్గొన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతూ... నేడు టీవీల్లో అరాచకం, అశ్లీలం, గొడవలు తప్ప ఏమీ లేవని వాపోయారు. సోషల్ మీడియా ఉదంతాల వల్ల ఆధ్యాత్మికత మర్చిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సమాజానికి గరికపాటి ప్రవచనాలు చైతన్యం తెస్తాయని చెప్పారు. మనసుపై పట్టు ఉంటే ఏదైనా సాధించవచ్చునని, మనస్సు మీద పట్టు లేకుంటే అష్టాదశ పీఠాలు తిరిగినా దండగేనన్నారు. రామాయణం, మహాభారతం లాంటివి సులభంగా అర్థం అయ్యేలా ప్రవచనాల రూపంలో వివరించారని పేర్కొన్నారు. గరికపాటి ప్రవచనాల గగనసాటి అని అభివర్ణించారు. సినిమా, క్రికెట్, పొలిటికల్ లీడర్స్ కంటే గరికపాటికి ఎక్కువ ఫాలోయింగ్ ఉందన్నారు. మానవ సేవ, మాధవ సేవ లాంటిదని.. వృద్ధులు, తల్లిదండ్రులు, దివ్యాంగులు, ఆపదలో ఉన్న వారికి చేసేసేవ గొప్పదని గరికపాటి ప్రవచనాల అర్థం అన్నారు. సిద్దిపేటలో ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని, తమ సంపూర్ణ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ రోజాశర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, నాయకులు శర్మ, సంపత్ రెడ్డి, సాయిరాం అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



గరికపాటికి ఉంగరం బహూకరిస్తున్న హరీశ్‌రావు



గరికపాటి నర్సింహారావు ప్రవచనాలను వింటున్న ప్రజలు